క్లుప్తంగా

నేడు మధ్యాహ్న కార్మికుల ధర్నా

సిరిసిల్లటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నారు. ఈమేరకు సోమవారం సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు ప్రకటన విడుదల చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో కార్మికులు అందరూ పాల్గొనాలని యూనియన్ ప్రతినిధులు మీసం లక్ష్మణ్ తదితరులు కోరారు.

యువకులకు అభినందన



వేములవాడ: కరీంనగర్‌లో ఈనెల 9న జరిగిన బ్లాక్‌బెల్ట్ గ్రేటింగ్ టెస్ట్‌లో వేములవాడకు కనికరపు రాజశేఖర్, ప్రతాప రుషిక్‌తేజ, గుడిసె విజయ్‌కుమార్ తమ ప్రతిభ కనబర్చి బ్లాక్‌బెల్ట్‌లు సాధించినట్లు ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్ సోమవారం తెలిపారు. వీరికి తెలంగాణ ఓకినావా స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ బ్లాక్‌బెల్ట్‌లు, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

రేపు సినారె వర్ధంతి

వేములవాడరూరల్: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, డా.సి.నారాయణరెడ్డి వర్ధంతిని ఈనెల 12న నిర్వహించనున్నట్లు సుశీల నారాయణరెడ్డి ట్రస్టు ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేటలోని ఆయన సొంత గ్రామంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై మూడవ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఉపాధిహామీ ఏపీవో శ్రీహరి సోమవారం తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మంగళవారం నుంచి శుక్రవారం నాలుగు రోజులు గ్రామసభలు నిర్వహించనున్నారన్నారు. 15న మండలకేంద్రంలో ప్రజావేదికను నిర్వహించనున్నామని, ఇందుకు మండలంలోని ప్రజాప్రతినిధులు ఉపాధి కూలీలు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి



మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలో పీఏసీఎస్ ద్వారా జరుగుతున్న వరిధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. ఈ సంవత్సరం రబీలో గతంలో ఎన్నడూ లేనివిధంగా లక్షా 93వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సొసైటీ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి తెలిపారు. దాదాపు రెండు నెలలుగా వేములవాడ సొసైటీ తరపున జరుగుతున్న ఈ కొనుగోళ్లలో అర్బన్, రూరల్ మండలాల్లో ఈ ధాన్యాన్ని ఈ సంవత్సరం రికార్డుస్థాయిలో కొనుగోలు చేశామని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరంలో రబీలో లక్షా 88 వేల 610 క్వింటాళ్లు కొనుగోలు చేయగా ఈ సంవత్సరం లక్షా 93 వేల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు.

డీడీ డబ్బులు వాపస్ ఇవ్వాలి



గంభీరావుపేట: రెండో విడత గొర్రెల పంపిణీ కోసం తాము చెల్లించిన డబ్బులను ప్రభుత్వం వెంటనే వాపస్ ఇవ్వాలని యాదవులు కోరారు. ఈ మేరకు మండలంలోని లింగన్నపేటకు చెందిన యాదవ కులస్తులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తాము దాదాపు 60 మంది రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు తీసి ఇచ్చామన్నారు. ప్రస్తుతం పథకం నిలిచిపోవడంతో తమ డబ్బులు తమకు చెల్లించాలని కోరారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



ఎల్లారెడ్డిపేట: రోడ్డు భద్రతను అందరూ సామాజిక బాధ్యతగా భావించాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. మండకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై సోమవారం ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 18 వాహనాలకు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వాహనాలు నడుపుతుండగా వాటిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

శివారులో అంధకారం

- భయం గుప్పిట్లో ప్రజలు
- తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు
- ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి



ఎల్లారెడ్డిపేట శివారులో ఎల్ఈడీ లైట్లు లేకపోవడంతో అలుముకున్న చీకటి

ఎల్లారెడ్డిపేట: మేజర్ పట్టణాలు, మండలకేంద్రాలు, గ్రామాల శివారు ప్రాంతాలు చీకట్లోనే మగ్గుతున్నాయి. విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలోనే ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. చీకట్లో ఓ వైపు రోడ్డు ప్రమాదాలు, చోరీలు మరోవైపు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్ మేజర్ గ్రామ పంచాయతీల్లో అంతా ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రయితే శివారు ప్రాంతాలు చీకట్లోనే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులు, వీధులవెంట అమర్చిన ఎల్ఈడీ లైట్లు పనిచేయకపోగా వాటి మరమ్మతు గ్రామపంచాయతీ, పాలవర్గాలు పట్టించుకోవడం లేదు. విద్యుత్ దీపాల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆభారం జీపీలపైనే పడుతోంది. ఫలితంగా ఖర్చులు తడిసిమోపెడు కావడంతో కొత్త విద్యుత్ దీపాల ఏర్పాటు, మరమ్మతులను జీపీలు పట్టించుకోవడం లేదు.

చీకట్లోనే రాకపోకలు

ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్ లాంటి పట్టణాల్లో విద్యుత్ దీపాలను సుందరీకరించారు. పెద్దఎత్తున నిధులు కేటాయించి పట్టణాలవరకే విద్యుత్ దీపాలను అలంకారప్రాయంగా మార్చగా శివారు ప్రాంతాలు చీకట్లోనే ఉంటున్నాయి. మండలకేంద్రం నుంచి గ్రామాలకు వీధిలైట్లు లేక చీకట్లోనే వాహనదారులు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో రోడ్డు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

శివారు ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేక గంజాయి, గుట్కా, గుడుంబా తాగడమే కాకుండా మహిళలు నివాసాలనుంచి బయటకు వస్తే వారిపై దురుసుగా ప్రవర్తించడం, లైంగిక దాడులకు పాల్పడడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఒంటిరిగా వెళ్తున్న వారిపై దాడులు చేసి దొంగతనాలకు పాల్పడడం పరిపాటిగా మారింది.

జీపీలపై నిర్వహణ భారం..

గ్రామాల్లో జీపీలపై విద్యుత్ దీపాల నిర్వహణ కోసం లక్షల్లో నిధులు కేటాయించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆ భారం జీపీలపై పడుతోంది. ఇప్పటికే సిబ్బంది జీతాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ చార్జిలు, ట్రాక్టర్ల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతుండగా, మరోవైపు ఇందుకు రెట్టింపు స్థాయిలో విద్యుత్‌దీపాల నిర్వహణ కోసం లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫలితంగా కొన్ని మేజర్ గ్రామ పంచాయతీల్లో శివారు ప్రాంతాలతో పాటు మరమ్మతుకు చేయాల్సిన ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి జీపీలపై ఆర్థికభారం పడకుండా చూడాలని మండంలోని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



మండలకేంద్రంలోని శివార్లలో వీధిలైట్లు లేక అంధకారం నెలకొంది. దీంతో రాత్రిపూట రోడ్లు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి శివారు ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసి త్వరగా సమస్యను పరిష్కరించాలి.

– మట్ట సత్తిరెడ్డి, అల్మాస్‌పూర్

పంచాయతీలపై భారం



వీధిలైట్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో గ్రామ పంచాయతీలపైనే భారం పడుతోంది. కొద్దిపాటి ఆదాయంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పదవిలో ఉన్నప్పుడు సర్పంచులు సొంత డబ్బులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయాల్సి వచ్చింది. వీధిలైట్ల నిర్వహణకు ప్రభుత్వమే నిధులు కేటాయించాలి.

– నిమ్మ లక్ష్మి, మాజీ సర్పంచ్, నారాయణపూర్

జీపీలదే నిర్వహణ బాధ్యత



మండల కేంద్రం, గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఉన్నంత వరకు వీధిలైట్లు ఏర్పాటు చేశాం. వాటి నిర్వహణ బాధ్యత జీపీలదే. సెంట్రల్ లైటింగ్‌తో ఒక్కోసారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎల్ఈడీ లైట్లు కాలిపోయిన స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని జీపీ సిబ్బందికి సూచించాం. శివారు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి.

– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన



చందుర్తి: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



బోయినపల్లి: బూర్గుపల్లిలో బడిబాట ర్యాలీ



ముస్తాబాద్: పోతుగల్‌లో ఇంటింటా అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి: మండలకేంద్రంలో ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొగ్గారపు శంకర్, ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలకు వేళ్లే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని వారికి సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఉపాధ్యాయులు కట్కూరి ముఖేశ్, కడారి నరేశ్, రవి, చంద్రకళ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళి నాయక్, ఉపాధ్యాయులు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగతూ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: సర్కారు పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని నోడల్ ఆఫీసర్ రాధాకిషన్ రావు అన్నారు. మండలంలోని పోతుగల్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల బాధ్యులు భార్గవి, జ్యోతి, నాయకులు తోట ధర్మేందర్, జంగరాజు, మహిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బడీడు పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని తద్వారా బడిని కాపాడుకుందామని అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పల్లె స్నేహ కోరారు. పాఠశాల ప్రత్యేకతలను వివరిస్తూ ఉపాధ్యాయులు బోయన్నగారి నారాయణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

రుద్రంగి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలకేంద్ర ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు కోరారు. మండలంలోని బడితండాలో రుద్రంగి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులతో కలిసి బడిబాట నిర్వహించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ రవి

వేములవాడఅర్బన్: కాంపౌండ్‌ను జేసీబీతో తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మ్యాకల రవి కలెక్టర్ అనురాగ్ జయంతికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వేములవాడ మండలం అనుపురంలో రైతుల అవసరాల కోసం నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గోదాం నిర్మాణానికి గతంలోనే పంచాయతీ పాలకవర్గం సమావేశం నిర్వహించి ప్లాట్ నెంబర్ 886 పక్కన 2 గుంటలను పాలకవర్గ తీర్మానంతో కేటాయించినట్లు తెలిపారు. ఆ స్థలంలో గోదాం కోసం ముందుగా కాంపౌండ్ నిర్మిస్తే పక్కన ప్లాట్ నంబర్ 886 గల వ్యక్తి కాంపౌండ్‌ను ఇటీవల జేసీబీతో తొలగించాడని, సదరు వ్యక్తిపై చర్యలు జెడ్పీటీసీ రవి వినతిపత్రంలో కోరారు. ఈ స్థలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గోదాం నిర్మించేందుకు అధికారులు సహకరించాలని కోరారు.

'నీట్' పై విచారణ చేపట్టాలి

గంభీరావుపేట: నీట్ పరీక్ష ఫలితాలు, నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీట్ పరీక్షల తీరుపై విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, వేణు, ప్రవీణ్, వంశీ, సాయి, అనిల్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తంగళ్లపల్లి: మండలంలోని కస్బేకట్కూర్ గ్రామంలో ఆదివారం రాత్రి బత్తుల సాగర్ అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతిచెందింది.. ఈ విషయాన్ని సోమవారం ఉదయం గుర్తించారు. వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృత్యువాత పడింది. మాజీ సర్పంచ్ పొన్నం లక్ష్మణ్‌గౌడ్ పశువైద్యాధికారులు, సెస్ సిబ్బందికి సమాచారం అందించగా వారు పరిశీలించారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



బ్యాగు అప్పగిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: ప్రయాణంలో మార్గమధ్యంలో బ్యాగు పోగొట్టుకున్న సిరిసిల్ల పట్టణ వాసులకు పోలీసులు బ్యాగు అందజేశారు. పట్టణంలోని సిద్ధులవాడకు చెందిన బల్యాల శ్రీనివాస్ దంపతులు ఈనెల 8న మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి కారులో సిరిసిలకు వెళ్తుండగా నేరెళ్ల వరకు చేరుకోగానే కారుపై కట్టిన బ్యాగు కిందపడిపోయింది. బ్లూకోల్ట్స్ సిబ్బంది బ్యాగును గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై డి.సుధాకర్ బ్యాగు గురించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేశారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న శ్రీనివాస్ దంపతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బ్యాగును తీసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో భాగంగానే తనిఖీలు

- ఎస్సై శేఖర్‌రెడ్డి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో వాహనాల తనిఖీలో కానిస్టేబుల్‌పై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని ఎస్సై శేఖర్‌రెడ్డి సోమవారం వివరించారు. విధి నిర్వహణలో భాగంగా ముస్తాబాద్‌లో వాహనాల తనిఖీ సమయంలో వ్యవసాయాధికారి బైక్ తాళాలు కానిస్టేబుల్ తీసుకెళ్లాడని వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ కోసం వచ్చిన వ్యవసాయాధికారిపై దురుసుగా ప్రవర్తించలేదన్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారితో మాట్లాడమన్నారు. దొంగ వాహనాలను గుర్తించడానికి, ప్రమాదాల నివారణకు నంబర్‌ప్లేట్ లేని వాహనాలను ఉపయోగించి చైన్‌స్నాచింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకే తనిఖీలు చేస్తున్నామన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య యాదవ్, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృత్తికే ఉద్యోగ విరమణ

- ఎస్పీ అఖిల్ మహాజన్



దేవరాజును సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఉద్యోగ విరమణ విధి నిర్వహణకే తప్ప వ్యక్తిత్వానికి కాదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. హోంగార్డుగా పనిచేసి ఉద్యోగ విరమణ సందర్భంగా సిరిగిరి దేవరాజ్‌ను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఘనంగా సన్మానించారు. గత 41 ఏళ్లుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్నా అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. అన్నారు. వెల్ఫేర్ ఫండ్ నుంచి ఆర్థికసాయంగా రూ. 10 వేలు అందించారు. జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేశారన్నారు. ఆర్ఐ రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, పౌర్ణమి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: భారత ప్రధానిగా నరేంద్రమోదీ హ్యాట్రిక్ సాధించడంపై జిల్లా కేంద్రంలో బీజేపీ నేతలు సంబరాలు జరిపారు. స్థానిక గాంధీచౌక్‌లో పటాకులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ రెండోసారి గెలిచి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, నాయకులు బర్కం నవీన్, కొండ నరేశ్, చొప్పదండి అంజన్న, మోర శ్రీహరి, మ్యాన రాంప్రసాద్, గాజుల వేణు, ఆనంద బాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



చందుర్తి : అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్



వీర్నపల్లి: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

ఎల్లారెడ్డిపేట: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ ,యువకులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 13న సిరిసిల్ల పట్టణంలోని కళ్యాణ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో 60 కంపెనీల సహాయంతో వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన వారు అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.

ముస్తాబాద్: నిరుద్యోగ యువత పోలీస్‌శాఖ నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం మండలకేంద్రంలో జాబ్‌మేళాపై ప్రజలతో మాట్లాడారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఈనెల 13న జాబ్‌మేళా జరగనుందన్నారు. నిరుద్యోగ యువకులు ఈ జాబ్‌మేళాకు సంబంధించిన స్లాట్‌ను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. వందకు పైగా కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

చందుర్తి: ఈనెల 13న పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాపై మండలకేంద్రంలోని యువకులకు ఎస్సై శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని కల్యాణ లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో 60 కంపెనీలతో వెయ్యికిపై ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువకులు పాల్గొనవచ్చన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని అన్ని గ్రామాల నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 13న జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సీఐ శ్రీనివాస్, జే రమేశ్ అన్నారు. సుమారు 60కి పైగా కంపెనీల ఆధ్వర్యంలో వెయ్యికిపైగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల యువకులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్లటౌన్: జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల సంధ్య, ఉపాధ్యక్షుడిగా జువ్వాజి అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా బోగ రాజయ్య, సహాయ కార్యదర్శిగా అంబటి శ్రీనివాస్, కోశాధికారి తడగొండ లత, గౌరవ అధ్యక్షులుగా బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎండీ ఖాదర్, మిట్టపెల్లి రమేశ్, వెల్ది గణేశ్, గవ్వలపెల్లి సుజాత, సుల్తాన మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో మల్లికార్జున యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒగ్గు కనకయ్య, ప్రధాన కార్యదర్శి అమరగొండ రాజేశ్, ఉపాధ్యక్షుడిగా మాసూరి మల్లేశం, కార్యదర్శిగా బండి రాజు, సహాయ కార్యదర్శిగా పెంటల అభిశాంత్, సలహాదారులుగా అమరగొండ ప్రభుదాస్, ఏనుగుల మహేశ్, కృష్ణబాబు ఎన్నికయ్యారు.

ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో భాగమైన ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి సోమవారం ఆవిష్కరించారు. కళాశాల ప్రత్యేకతలపై అవగాహన కల్పించేలా పోస్టర్లను ముద్రించినట్లు తెలిపారు. దోస్త్ లో కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2010-2011లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.